# కలం

kalamdaily.com

Follow on: Kalamtelugu

బుధవారం
18-03-2026 పేజీలు: 5

ప్రజల గళం...


360° SINGLE TOPIC

## మత్తు వదలరా..!

# డ్రగ్స్.. పాలిటిక్స్





ఈ నెల 14 రాత్రి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఈగల్ టీమ్ తనిఖీలు

### కుదిపేస్తున్న రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ వీకెండ్ పార్టీ

### సిమ్లా టు మొయినాబాద్ డ్రగ్స్ సప్లై, టెస్ట్ పాజిటివ్

### ప్రజాప్రతినిధులందరికీ టెస్టులు చేయాలని డిమాండ్లు

ఒకప్పుడు స్కూళ్ల దగ్గర గంజాయి చాక్లెట్లు, కాలేజీల దగ్గర హాష్ ఆయిల్.. పబ్‌లలో డ్రగ్స్.. ఇప్పుడు ఫామ్‌హౌస్‌లలో కొకైన్ పొట్లాలు.. ఫస్ట్ టైమ్ పొలిటీషియన్లు డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డారు. నిషేధిత మాదకద్రవ్యాలు దొరికాయి. ల్యాబ్ టెస్టులో సిట్టింగ్ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేకు పాజిటివ్ నిర్ధారణ. ఈ ఇద్దరికీ పార్టీల హైకమాండ్ షోకాజ్ నోటీసులు. ఆదర్శంగా ఉండాల్సిన ప్రజా ప్రతినిధులే డ్రగ్స్ వ్యవహారాల్లో చిక్కుకోవడంతో మొదలైన పొలిటికల్ డిబేట్.. రోడ్లమీద డ్రంకన్ డ్రైవ్ తరహాలోనే అసెంబ్లీకి వచ్చే ప్రజా ప్రతినిధులకూ డ్రగ్స్ టెస్టులు నిర్వహించాలనే డిమాండ్ల వరకు వెళ్లాయి.

*గతంలో ‘వైట్ ఛాలెంజ్’లు.. ఇప్పుడు అసెంబ్లీలోనే టెస్టింగ్ సెంటర్ పెట్టాలంటున్న కొందరు.. ఎప్పుడు పెట్టినా ఎక్కడకు రమ్మన్నా రెడీ అంటూ ఇంకొందరు.. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ లీడర్ కేటీఆర్ మధ్య సవాళ్లు - ప్రతిసవాళ్లు. పొలిటీషియన్లకు డ్రగ్స్ దందాలతో లింకులున్నట్లు మరికొందరి ఆరోపణలు రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి.*

*‘డ్రగ్స్-ఫ్రీ తెలంగాణ’ టార్గెట్‌గా ఈగల్ ఫోర్స్ ఏర్పాటు. పబ్‌లు, రెస్టారెంట్లు, రిసార్టుల నుంచి ఫామ్‌హౌస్‌లకు షిఫ్ట్ అవుతున్న డ్రగ్స్.. ఎక్కడున్నా పట్టేస్తామంటున్న పోలీసులు.. ప్రభుత్వ పక్కా విజన్.. దానికి తగిన యాక్షన్ ప్లాన్..!*

రాష్ట్రంలో డ్రగ్స్ వ్యవహారంపై *కలం 360 డిగ్రీస్* స్పెషల్...

తెలంగాణ బ్యూరో, కలం

### అలా జరిగితే దేశానికే ఆదర్శం!

దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలోనూ అధికారికంగా, మూకుమ్మడిగా ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్టులు చేసిన దాఖలాలు లేవు. ఇన్నాళ్లూ చాలెంజ్‌లు విసురుకోవడాలు, డిమాండ్ల వరకే పరిమితమైంది. కానీ.. తెలంగాణలో ఆ డిమాండ్ పెరుగుతున్నందున , అందుకు తగ్గట్టు టెస్టింగ్‌కు అంతా ఓకే అయితే, అందరూ చేయించుకుంటే.. దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుంది. డ్రగ్స్ టెస్టు చేయించుకున్న ఆదర్శ ఎమ్మెల్యేలుగా నిలుస్తారు.



### ఎమ్మెల్యేలకు వైట్ చాలెంజ్

రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్టులు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. బీఆర్ఎస్ నేత రోహిత్ రెడ్డి డ్రగ్స్ తీసుకుంటూ దొరకడంతో దీని చుట్టే రాజకీయాలు నడుస్తున్నాయి. పీసీసీ చీఫ్‌గా ఉన్న టైమ్‌లో రేవంత్ రెడ్డి కూడా వైట్ చాలెంజ్‌కు రావాలంటూ నాటి మంత్రి కేటీఆర్ కు సవాల్ చేశారు. అప్పట్లో అది సంచలనం. ఇప్పుడు మళ్లీ తెరమీదికి వచ్చింది. ప్రజలకు ఆదర్శంగా ఉండాలంటే ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ డ్రగ్స్ టెస్టు చేయించుకోవాల్సిందేనని, దీనికి సభా నాయకుడితో పాటు ప్రతిపక్ష నాయకుడు కూడా అతీతులు కారని అంటున్నారు. అధికార పార్టీ కాంగ్రెస్ తోపాటు ప్రతిపక్ష పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్ కూడా ఇదే డిమాండ్ చేస్తున్నాయి. సాక్షాత్తు మండలి వేదికగా పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్ ఇదే అంశాన్ని లేవనెత్తారు. ఇలాంటి కామెంట్ల నడుమ ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి టెస్టులు చేయించుకుంటారా? అసెంబ్లీ వేదికగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తారా? మూడు నెలలకోసారి డ్రగ్స్ టెస్టులకు అంగీకరించేదెవరు? ఇప్పుడు ఇదే హాట్ టాపిక్.

### ఈ నెంబర్‌కు ఫోన్ చేస్తే చాలు

డ్రగ్స్‌పై ఏదైనా సమాచారం ఇవ్వడానికి టోల్ ఫ్రీ నంబర్ **1908** లేదా ఈగల్ కంట్రోల్ రూమ్ **8712671111**కు కాల్ చేయవచ్చు.

### 3 నెలలకోసారి మస్ట్: అనిరుధ్ రెడ్డి

ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్టులు మస్ట్‌గా చేయాలని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతీ 90 రోజులకోసారి ఇది జరగాలన్నారు. టెస్టుకు రాని ఎమ్మెల్యేలను అనుమానించాల్సి ఉంటుందని, అలాంటి వాళ్లను అసెంబ్లీలోకి అడుగుపెట్టనివ్వొద్దని వ్యాఖ్యానించారు. డ్రగ్స్ మూలాలు సినిమా ఇండస్ట్రీలో ఎక్కువగా ఉన్నాయని.. సినీ నటులు డ్రగ్స్ టెస్టులు చేయించుకున్న తర్వాతే వారి సినిమాలు రిలీజ్ చేయాలన్నారు.

### నేను రెడీ: రాకేశ్ రెడ్డి

డ్రగ్స్ టెస్టులకు తాను రెడీ అని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో డ్రగ్స్ కల్చర్ పెరిగిపోయిందని, అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరికీ డ్రగ్స్ టెస్టులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.




### అనవసరంగా లాగితే చర్యలే: కేటీఆర్



డ్రగ్స్ టెస్టులకు సిద్ధమని తాను ఇప్పటికే చాలాసార్లు ప్రకటించానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ‘‘ప్రజాప్రతినిధులందరూ స్వచ్ఛందంగా డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలి. డ్రగ్స్ తీసుకునేవాళ్లు ఎంతటివారైనా ఉపేక్షించొద్దు. ఎమ్మెల్యేగా టెస్టు చేయించుకోవడానికి నేను రెడీ’’ అని చెప్పారు. అయితే.. డ్రగ్స్ కేసు బయటకు వచ్చిన ప్రతిసారీ అనవసరంగా తన పేరును లాగితే ఊరుకునేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.

### సీఎం రెడీ.. కేటీఆర్ రావాలి: మహేశ్ గౌడ్



కేటీఆర్ సహా ప్రజా ప్రతినిధులంతా డ్రగ్స్ టెస్టుకు సిద్ధం కావాలని, ప్రజలకు ఆదర్శంగా ఉండాలని పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్ సూచించారు. మంగళవారం ఆయన మండలిలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం డ్రగ్స్ టెస్టుకు వస్తారని, ఆయనను రప్పించే బాధ్యతను పార్టీ తీసుకుంటుందన్నారు. సభా నాయకుడికి, ప్రతిపక్ష నాయకుడికి కూడా డ్రగ్ టెస్టులు జరగాలని సూచించారు.



## పైలట్ రోహిత్ రెడ్డి
# C/o కాంట్రవర్సీ

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో తాజాగా జరిగిన డ్రగ్స్ పార్టీ రాజకీయాలను కుదిపేస్తున్నది. ఆయన డ్రగ్స్ తీసుకుంటూ ఈగల్ టీమ్‌కు దొరికిపోయారు. గతంలో ఇదే ఫామ్ హౌస్ వేదికగా ఎమ్మెల్యేల కొనుగోలు ఎపిసోడ్ జరిగింది.

- మొయినాబాద్‌లో రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్ లో 2022లో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం సంచలనంగా మారింది. రోహిత్ రెడ్డితో పాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేలను బీజేపీలోకి లాక్కునేందుకు ప్రలోభాలు జరిగాయంటూ, దీన్ని రోహిత్ రెడ్డి బయటపెట్టారంటూ అప్పటి సీఎం కేసీఆర్ పలు ఆధారాలతో మీడియా ముందుకు వచ్చారు.
- ఈ నెల 14న అదే ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ రాజకీయాల్లో హీట్ పుట్టించింది. ఈగల్ టీమ్ రెయిడ్స్ చేసి రోహిత్ రెడ్డితోపాటు ఏపీ ఎంపీ పుట్టా మహేశ్ సహా పలువురిని అరెస్ట్ చేసింది. ఈగల్ టీమ్‌పై అక్కడి సిబ్బంది కాల్పులు జరపడంతో వారిపై హత్యాయత్నం కేసు కూడా నమోదైంది. సిమ్లా నుంచి ఇక్కడికి డ్రగ్స్ తెచ్చినట్లు పోలీసులు గుర్తించారు.
- పైలట్ రోహిత్ రెడ్డి వ్యవహారం బీఆర్ఎస్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. పార్టీ నేత డ్రగ్స్ తీసుకుంటూ దొరకడంతో డైలమాలో పడింది. రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ షోకాజ్ నోటీస్ జారీ చేసినప్పటికీ.. దాని నుంచి ఎలా బయటపడాల్నో అంతుచిక్కని పరిస్థితి. ఇప్పటికే డ్రగ్స్ అంటేనే బీఆర్ఎస్ అంటూ కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి.





## తీగ లాగనున్న 'సిట్'.. బీఆర్ఎస్‌లో టెన్షన్

మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ వ్యవహారం బీఆర్ఎస్ మెడకు చుట్టుకున్నది. ఆ ఫామ్‌హౌస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిది కావడంతో ఇష్యూ సీరియస్ అవుతున్నది. గతంలో ఇదే ఫామ్‌హౌస్ కేంద్రంగా ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం కూడా నడిచినందున పాత కథ మొత్తం తెర మీదకు వచ్చే అవకాశమున్నది. డ్రగ్స్ తెచ్చిందీ, వాడిందీ, టెస్టులో పాజిటివ్ వచ్చిందీ వాస్తవమని ఒకవైపు వాంగ్మూలం, మరోవైపు నార్కోటిక్ టెస్టుల్లో పాజిటివ్ అని తేలడంతో రోహిత్ రెడ్డి ప్రమేయం కుండబద్దలు కొట్టినట్లు వెల్లడైంది. ఇంతవరకు జరిగిన కథ ఎలా ఉన్నా.. ఇకపై ఏం జరుగుతుందోనని బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన నెలకొన్నది. జరగబోయే దర్యాప్తును ముందుగానే పసిగట్టిన బీఆర్ఎస్.. పైలట్ రోహిత్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేయక తప్పలేదు.

### సిట్‌తో సర్వం వెలుగులోకి..

రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ వ్యవహారం రోజుకో టర్న్ తీసుకుంటున్నది. అక్కడ డ్రగ్స్ మాత్రమే కాక తుపాకీ కాల్పులు కూడా జరగడం మొత్తం ఇష్యూను మరో డైరెక్షన్‌లోకి తీసుకెళ్లింది. ఈ వ్యవహారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకోవడంతో సిట్ ఏర్పాటుకు డీజీపీ ఆదేశాలు ఇచ్చారు. చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటైంది. దీంతో ఫామ్‌హౌస్ మూలాలు మొత్తం వెలుగులోకి వచ్చే అవకాశమున్నది. వీకెండ్ పార్టీకి వచ్చినవారితో రోహిత్ రెడ్డికి ఉన్న సంబంధాలేంటి? ఎంతకాలం నుంచి కొనసాగుతున్నాయి? వారి మధ్య ఉన్న వ్యాపార లావాదేవీలు, రియల్ ఎస్టేట్ బిజినెస్.. ఇలా అన్ని కోణాల నుంచి సిట్ దర్యాప్తు చేయనున్నది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రోహిత్ రెడ్డిని కస్టడీలోకి తీసుకుని విచారించి మరిన్ని వివరాలను రాబట్టాలన్నది పోలీసుల ఆలోచన.

### బీఆర్ఎస్ లీడర్లు ఉక్కిరిబిక్కిరి

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిన చందంగా రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ వ్యవహారం బీఆర్ఎస్‌లో ఎవరెవరి మెడకు చుట్టుకుంటుందనే గుబులు మొదలైంది. ఇది కేవలం తాజా డ్రగ్స్ దర్యాప్తుకు మాత్రమే పరిమితం కాదని, గతంలో జరిగిన మొత్తం వ్యవహారాలను సిట్ వెలికి తీస్తుందనేది గుబులు రేకెత్తిస్తున్నది. అందుకే గులాబీ లీడర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం ఈ ఫామ్‌హౌస్ కేంద్రంగానే జరగడంతో అప్పటి వివరాలు కూడా వెలుగులోకి వచ్చే అవకాశమున్నది. ఫోన్‌ట్యాపింగ్ ద్వారానే ఎమ్మెల్యేల కొనుగోలు అంశాన్ని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పసిగట్టిందని, దానికి తగినట్లుగా కేసీఆర్ డైరెక్షన్‌లోనే సీసీ కెమెరాల ఏర్పాటు జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. పకడ్బందీగా వీడియో, ఆడియో ఫుటేజీ రికార్డింగ్ ప్లానింగ్ కూడా కేసీఆర్ నుంచే వచ్చిందని అప్పట్లో వార్తలు వినిపించాయి. ఇవన్నీ సిట్ దర్యాప్తుతో వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి.

### తీగ లాగితే డొంకంతా కదులుతుందా?

డ్రగ్స్ విషయంలో ప్రభుత్వం మొదటి నుంచీ సీరియస్‌గా ఉన్నది. గత ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు డ్రగ్స్ మూలాల్లేకుండా చేయాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన. డ్రగ్స్ వ్యవహారం ఎంతకాలం నుంచి నడుస్తున్నది? ఇక్కడికి సప్లై చేస్తున్నదెవరు? సూత్రధారి, పాత్రధారి, మీడియేటర్లు ఎవరు? ఫామ్‌హౌస్‌కు రెగ్యులర్‌గా వచ్చేదెవరు? వారితో రోహిత్‌రెడ్డికి ఎలాంటి వ్యాపార బంధం ఉంది? అప్పట్లో ఎమ్మెల్యేల కొనుగోలులో ఎవరి నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చాయి? పకడ్బందీ స్కెచ్ వేసి తీసిన వీడియో ఫుటేజీ రికార్డింగ్‌లో ఏం జరిగింది? ఆదేశాలు ఎవరివి? అమలు చేసిందెవరు?... ఇవన్నీ ఇప్పుడు రోహిత్ రెడ్డి నుంచే సిట్ రాబట్టనున్నది. రోహిత్ రెడ్డి నోరు విప్పితే ఎవరి పేర్లు బయటకు వస్తాయి? అది చివరకు ఎక్కడికి వెళ్తుంది? అన్నది ఆసక్తి రేకెత్తిస్తున్నది.. గులాబీ లీడర్లను వణికిస్తున్నది.



### 2018 నుంచి భారీగా డ్రగ్స్ సప్లై

తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి కొన్నేండ్లు డ్రగ్స్ కేసులు తక్కువే నమోదయ్యాయి. ఏడాదికి 800 నుంచి 900 కేసుల వరకు రిజిస్టర్ అయ్యాయి. 2014 నుంచి 2017 వరకు సుమారు 4వేల కేసులు రిజిస్టర్.

- 2018 నుంచి డ్రగ్స్ కేసులు భారీగా పెరిగాయి. హైదరాబాద్‌కు ఇంటర్నేషనల్ డ్రగ్స్ రాకెట్లతో కనెక్షన్. నైజీరియన్ డ్రగ్ నెట్‌వర్క్ యాక్టివ్. పార్టీ కల్చర్ పెరగడం. 2018 నుంచి 2020 మధ్య ఏడాదికి సుమారు 1,300 కేసులు రిజిస్టర్. మొత్తం మూడేండ్లలో సుమారు 4,500 కేసులు నమోదు.
- 2021 కరోనా తర్వాత పెరిగిన డ్రగ్స్ వినియోగం. 2021 నుంచి 2023 తెలంగాణకు క్రిటికల్ స్టేజ్. డార్క్ వెబ్, కొరియర్ సర్వీసుల ద్వారా డ్రగ్స్ సప్లై. ప్రారంభమైన పోలీసుల భారీ ఆపరేషన్. ఏడాదికి సుమారు 1,500 వరకు కేసులు నమోదు. 2021 నుంచి 2023 మధ్య 5,300 కేసులు రిజిస్టర్.
- 2024 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా హై అలర్ట్. పెద్ద పెద్ద డ్రగ్స్ రాకెట్ కేసులను ప్రత్యేక బృందాలు క్రాక్ చేశాయి. ఈగల్ వంటి స్పెషల్ యూనిట్లు యాక్టివ్. 2024లో 1,950 కేసులు, 2025లో 2,542 కేసులు రిజిస్టర్.
- 2014 నుంచి 2025 వరకు సుమారు 19వేల వరకు డ్రగ్స్ కేసులు రిజిస్టర్ అయ్యాయి.

### 2024లో రికార్డు స్థాయిలో కేసులు

తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి డ్రగ్స్, నార్కోటిక్స్ కేసులు భారీగా పెరుగుతూ వచ్చింది. గత మూడేండ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ సప్లైపై పోలీసుల నిఘా పెరిగింది. ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) టీమ్ ఏర్పాటయ్యాక కేసుల సంఖ్య భారీగా పెరిగింది.

- 2017లో రాష్ట్రంలో కేవలం 381 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు. 2024 నాటికి ఆ సంఖ్య 2,181కు పెరిగింది. అంటే సుమారు 470 శాతం కంటే ఎక్కువ.
- 2017లో అరెస్ట్ అయిన వారిలో 826 మంది భారతీయులు, 29 మంది విదేశీయులు. 2024లో 5,258 మంది ఇండియన్స్, 18 మంది విదేశీయులు.
- 2021లో అత్యధికంగా 38,572 కిలోల డ్రగ్స్ స్వాధీనం. 2024లో 21,871 కిలోల మత్తు పదార్థాలు సీజ్.
- 2017లో నమోదైన కేసులతో పోలిస్తే ఇప్పుడు దాదాపు 5 రెట్లు ఎక్కువ కేసులు నమోదు.

# మత్తు వదలరా..!



నారాయణఖేడ్‌లో 600 గంజాయి మొక్కలను ధ్వంసం చేసిన పోలీసులు (ఫైల్)

## 12 ఏండ్లలో రాష్ట్రంలో ఇలా..

నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) యాక్ట్ కింద నమోదైన కేసులు, అరెస్టులు..

| సంవత్సరం | నమోదైన కేసులు | అరెస్టులు |
|---|---|---|
| 2014 | 169 | 148 |
| 2015 | 220 | 200 |
| 2016 | 300 | 350 |
| 2017 | 381 | 826 |
| 2018 | 600 | 998 |
| 2019 | 880 | 1,180 |
| 2020 | 1,160 | 1,460 |
| 2021 | 1,750 | 1,980 |
| 2022 | 1,176 | 2,582 |
| 2023 | 1,464 | 4,288 |
| 2024 | 2,169 | 6,719 |
| 2025 | 2,542 | 8,322 |

### ఎంతటివారినైనా వదలం

"పోరాట పటిమ కలిగిన తెలంగాణ యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారుతుండడం బాధాకరం. రాష్ట్ర భవిష్యత్ ను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ చేతులు కలపాలి. రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మినా.. కొనుగోలు చేసినా కఠినంగా శిక్షిస్తాం. ఎక్కడ గంజాయి, డ్రగ్స్ కనిపించినా ఈగల్ టీమ్ పట్టేస్తుంది. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలుదారులపై నిత్యం నిఘా ఉంటుంది. వారికి నిద్రలేని రాత్రులే. డ్రగ్స్ దందాలో ఉన్నవాళ్లు ఎంతటివాళ్లయినా వదిలిపెట్టం. డ్రగ్స్ మహమ్మారిని రాష్ట్రం నుంచి సమూలంగా నిర్మూలిస్తాం. 'సేవ్ సొసైటీ.. సేవ్ జనరేషన్.. సేవ్ కిడ్స్' నినాదంతో ముందుకెళ్దాం. డ్రగ్స్ నిర్మూలన కోసం పోలీసులు ఎవరూ కాంప్రమైజ్ కావొద్దు.''

- సీఎం రేవంత్ రెడ్డి (వివిధ సందర్భాల్లో ప్రకటన)






### కేసీఆర్ ఫస్ట్ టర్మ్

2014 నుంచి 2018 మధ్య ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద సుమారు 1,670 కేసులు నమోదు. 2,522 మంది అరెస్ట్. 2017లో టాలీవుడ్ డ్రగ్స్ కేసు, స్కూల్ స్టూడెంట్లకు డ్రగ్స్ సప్లై చేస్తున్న ముఠాల పట్టివేత.

2017లో పట్టుబడిన వారిలో 29 మంది ఫారినర్స్. అత్యధికులు నైజీరియా, దక్షిణాఫ్రికా దేశస్థులు.

2014 నుంచి 2018 మధ్య సుమారు 25వేల కిలోల గంజాయి పట్టివేత. 2017లోనే 7,423 కిలోల గంజాయి స్వాధీనం.

2018లో కల్లులో కలిపేందుకు వాడే 8 కిలోల పాస్పరస్ పెంటా సల్ఫైడ్ (ఆల్ప్రాజోలమ్ తయారీకి వాడేది) స్వాధీనం.

2017లో హైదరాబాద్‌లో వెయ్యికి పైగా ఎల్ఎస్‌డీ బ్లాట్లు పట్టివేత.

కేసీఆర్ ఫస్ట్ టర్మ్‌లో స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు రూ.70 కోట్లు.

### ..సెకండ్ టర్మ్

2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు సుమారు 7,030 డ్రగ్స్ కేసులు రిజిస్టర్. 12,488 మంది అరెస్ట్.

రాష్ట్రంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌పై నిఘా పెట్టేందుకు హెచ్–న్యూ (హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్) ఏర్పాటు.

ఐదేండ్లలో 1,20,000 కిలోల గంజాయి స్వాధీనం. 2021లో38,572 కిలోలు సీజ్.

15 కిలోల హెరాయిన్, 8 కిలోల కొకైన్ స్వాధీనం. 5 కిలోల ఎండీఎంఏ పౌడర్, వేల సంఖ్యలో పిల్స్ సీజ్. సుమారు 3,500కు పైగా ఎల్ఎస్‌డీ బ్లాట్లు స్వాధీనం.

విశాఖ నుంచి హైదరాబాద్ మీదుగా రవాణా అవుతున్న 250 లీటర్ల హ్యాష్ ఆయిల్ సీజ్.

2018 నుంచి 2023 మధ్య పట్టుబడిన మత్తు పదార్థాల విలువ సుమారు రూ.550 కోట్లు. 90 మంది విదేశీయుల అరెస్ట్. వీరిలో ఎక్కువ మంది నైజీరియా, టాంజానియా, కెన్యా దేశస్తులు.

2022లో సీఎం కేసీఆర్ డ్రగ్స్ నియంత్రణపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహణ. వెయ్యి మందితో స్పెషల్ ఇంటెలిజెన్స్ సెల్ ఏర్పాటు. ఇదే తర్వాత పూర్తి స్థాయి యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్).

### కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనలో..

డిసెంబర్ 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్. టీజీ న్యాబ్, ఈగల్ పేరుతో ప్రత్యేక ఆపరేషన్లు.

2023 డిసెంబర్ నుంచి మార్చి 2026 వరకు సుమారు 5,203 కేసులు రిజిస్టర్. సుమారు 13వేల మంది అరెస్ట్.

75వేల కిలోల గంజాయి స్వాధీనం. 2025 ఒక్క ఏడాదిలోనే రికార్డు స్థాయిలో గంజాయి సీజ్. 5,500 కిలోల ఓపీయం, పాపీ స్ట్రా సీజ్. 3.5 కిలోల ఎండీఎంఏ, 2,800 బ్లాట్ల ఎల్ఎస్‌డీ, 1.2 కిలోల కొకైన్, 180 లీటర్ల హ్యాష్ ఆయిల్ స్వాధీనం.

27 నెలల్లో స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు రూ.350 కోట్లు.

2024లో ఒకేసారి 210 కోట్ల విలువైన డ్రగ్స్ దహనం చేసిన పోలీసులు. 2025 ఫిబ్రవరిలో మరో 47 కోట్ల నిల్వలు ధ్వంసం.

పట్టుబడిన వారిలో 41 మంది నైజీరియన్లు.



# మత్తు వదలరా..!



## డ్రగ్స్ కేసుల్లో ప్రముఖులు


- 2014 నుంచి 2026 వరకు డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన ప్రముఖులు. 2017లో టాలీవుడ్ డ్రగ్స్ కేసు. కెల్విన్ అనే డ్రగ్స్ పెడ్లర్ అరెస్ట్‌తో బయటికొచ్చిన సినీ పరిశ్రమకు చెందిన పలువురి పేర్లు. పూరీ జగన్నాథ్, రవితేజ, తరుణ్, నవదీప్, చార్మీ, ముమైత్ ఖాన్ తదితరులు.
- 2022 రాడిసన్ బ్లూ పబ్ కేసు. పట్టుబడిన సినీ నటుడు నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల (పోలీసులు నోటీసులు ఇచ్చి పంపించారు), రాహుల్ సిప్లిగంజ్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కొడుకు గల్లా సిద్దార్థ్.
- 2024 - 2025లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల, హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్ యజమాని కొడుకు మౌర్యపై కేసు.
- డ్రగ్స్ పెడ్లింగ్ కేసులో ముంబైకి చెందిన ఇంటర్నేషనల్ డ్రగ్స్ వ్యాపారి టోనీ, గోవాలో మరో పెడ్లర్ నరేంద్ర ఆర్య అరెస్ట్.
- చాలా కేసుల్లో ప్రముఖులను కేవలం కన్జ్యూమర్, అనుమానితులుగా విచారణ. వీరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ లోని సెక్షన్ 27 కింద కేసులు రిజిస్టర్. చాలా మందికి కోర్టుల నుంచి ఊరట. కానీ, ఈ కేసులపై రాష్ట్ర రాజకీయాల్లో, మీడియాలో తీవ్ర చర్చ.



## టాలీవుడ్ డ్రగ్స్ కేసు

- 2017లో సంచలనం సృష్టించిన టాలీవుడ్ డ్రగ్స్ కేసు. 12 కేసులు నమోదు చేసిన సిట్. మెజారిటీ కేసులు సాక్ష్యాధారాలు లేకపోవడంతో కొట్టేసిన కోర్టు. 2024 ఫిబ్రవరిలో 8 కేసుల్లో 6 కేసులు డిస్మిస్.
- ఎఫ్ఎస్ఎల్ రిపోర్టుల ప్రకారం నటుల నుంచి సేకరించిన గోళ్లు, వెంట్రుకల శాంపిల్స్‌లో దొరకని డ్రగ్స్ ఆనవాళ్లు. ప్రధాన నటీనటులకు క్లీన్ చిట్.
- డ్రగ్స్ కొనుగోలులో జరిగిన మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ. హవాలా, ఆర్థిక అక్రమాలకు సంబంధించి దొరకని ఆధారాలు.
- పూరీ జగన్నాథ్, రవితేజ, రానా దగ్గుబాటి, రకుల్ ప్రీత్ సింగ్, చార్మి, నవదీప్, తరుణ్, ముమైత్ ఖాన్, తనీష్, నందు, సుబ్బరాజు, శ్యామ్ కె. నాయుడును విచారించిన సిట్, ఈడీ.

## జన్వాడ ఫామ్ హౌస్ కేసు



- కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు చెందిన రంగారెడ్డి జిల్లా జన్వాడ ఫామ్‌హౌస్‌లో 2024 అక్టోబర్ 26–27 రాత్రి పార్టీ.
- సైబరాబాద్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు, స్పెషల్ ఆపరేషన్ టీమ్ పోలీసుల దాడులు.
- పార్టీలో ఉన్న 21 మంది పురుషులకు డ్రగ్స్ టెస్ట్. విజయ్ మద్దూరికి మాత్రమే పాజిటివ్. కొకైన్ వాడినట్లు నిర్ధారణ.
- రాజ్ పాకాలపై మూడు రకాల ఆరోపణలతో కేసులు, తన నివాసంలో డ్రగ్స్ వాడకానికి పర్మిషన్ ఇచ్చినందుకు ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు. అనుమతి లేకుండా విదేశీ మద్యం, పరిమితికి మించి మద్యం సీసాలు ఉంచినందుకు ఎక్సైజ్ చట్టం కింద కేసు. ఫామ్‌హౌస్‌లో పోకర్ కాయిన్లు, పేక ముక్కలు దొరకడంతో గేమింగ్ చట్టం కింద కేసు.
- రాజ్ పాకాల క్వాష్ పిటిషన్ దాఖలు. విచారించిన హైకోర్టు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశాలు. ప్రస్తుతానికి విచారణ దశలో కేసు. పాజిటివ్ వచ్చిన విజయ్ మద్దూరిని ఇప్పటికే పలుమార్లు విచారించిన పోలీసులు.



## 2024లో 46 శాతం పెరిగిన కేసులు

2023తో పోలిస్తే 2024లో 46 శాతం పెరిగిన కేసులు. సీఎం రేవంత్ ఆదేశాల మేరకు టీజీ న్యాబ్‌కు పూర్తి స్థాయి సిబ్బంది, నిధుల కేటాయింపు. రాష్ట్రవ్యాప్తంగా 7 రీజినల్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్స్, 4 స్పెషల్ నార్కోటిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు. చిన్న మొత్తంలో డ్రగ్స్ దొరికినా వదలకుండా కేసులు రిజిస్టర్ చేసిన పోలీసులు. డ్రగ్స్ నెట్‌వర్క్ ఛేదించేందుకు డిజిటల్ అండ్ నార్కోటిక్స్ ల్యాబ్స్ ఏర్పాటు. 2024లో రూ.148 కోట్ల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం.

- 2023తో పోలిస్తే 2024లో 46 శాతం పెరిగిన డ్రగ్స్ కేసులు. 76 శాతం పెరిగిన అరెస్ట్‌లు. 2023 నుంచి అక్టోబర్ 2024 నాటికి 1,763 కేసులు రిజిస్టర్. 2023లో ఉన్న అరెస్టుల కంటే.. 2024లో సుమారు 4,200 మంది అరెస్ట్.
- టీజీ న్యాబ్, పోలీసుల గణాంకాల ప్రకారం.. 2024లో రూ.142 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం. 2025 వార్షిక నివేదిక ప్రకారం.. రూ.172 కోట్ల మత్తు పదార్థాలు సీజ్.



## రెండేండ్లలో రూ.55 కోట్ల ఆస్తులు జప్తు

- తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ - న్యాబ్), డీజీపీ విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం.. గత రెండేండ్లలో 10 ప్రధాన కేసుల్లో నిందితులకు చెందిన రూ.55.8 కోట్ల విలువైన ఆస్తుల జప్తు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68 (ఎఫ్) కింద సీజ్. రూ.55.8 కోట్లలో రూ.33 కోట్లు ఆల్ప్రాజోలమ్ తయారీదారుల ఆస్తులే. లింగగౌడ్, అతని అనుచరుల నుంచి కొండాపూర్‌లోని లగ్జరీ అపార్ట్‌మెంట్లు, శంకరంపేట, రామాయంపేటలోని భూములు జప్తు.
- ఒక డ్రగ్స్ కేసులో పోలీస్ కానిస్టేబుల్ ప్రమేయం. రూ.4.50 కోట్ల ఆస్తులు జప్తు. గుమ్మడిదల ప్రాంతంలో ఫంక్షన్ హాల్‌ను ఆల్ప్రా జోలమ్ ఫ్యాక్టరీగా మార్చినందుకు రూ. కోటి రూపాయల ఆస్తులు స్వాధీనం. కువైట్‌లో ఉంటూ ఫెంటానిల్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న అహసాన్ ముస్తాఫా ఖాన్‌కు చెందిన 2 కోట్ల విలువైన ఆస్తులు జప్తు.

# ఈగల్ చూస్తోంది!

## డ్రగ్స్‌పై స్పెషల్ టీమ్ ఉక్కుపాదం.. 2025 జూన్ 26న ఏర్పాటు

## తాజాగా రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌పై ఆపరేషన్

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలో
పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు (ఫైల్)



### పెడ్లర్లు, స్మగర్ల గుండెల్లో వణుకు

బీఆర్ఎస్ సెకండ్ టర్మ్‌లో రాష్ట్రంలో డ్రగ్స్ కలకలం రేపింది. హైదరాబాద్‌లోని విద్యాసంస్థలు, ఐటీ సంస్థలు, సినీ పరిశ్రమ.. ఇలా చాలా చోట్ల మాదకద్రవ్యాల ఆనవాళ్లు కనిపించాయి. స్కూల్ పిల్లల చాకెట్లలోనూ డ్రగ్స్ దొరికిన సంఘటనలూ ఉన్నాయి. పబ్స్‌లో డ్రగ్స్ పార్టీలు నిత్యకృత్యంగా మారాయి. పోలీసులు దాడులు చేసినా ఆగలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. 2023 డిసెంబర్ 10న తొలిసారిగా ఎక్సైజ్, నార్కోటిక్ డ్రగ్స్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించి.. డ్రగ్స్ అమ్మేవారిపై, కొనుగోలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ‘ సేవ్ సొసైటీ.. సేవ్ జనరేషన్.. సేవ్ కిడ్స్’ నినాదంతో ముందుకెళ్లారు. 2025 జూన్ 26న స్పెషల్‌గా ‘ఈగల్’ టీమ్ ను ఏర్పాటు చేశారు. రెయిడ్స్‌తో పెడ్లర్లు, స్మగర్ల గుండెల్లో ఈగల్ వణుకుపుట్టిస్తున్నది.

తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం గతేడాది జూన్ 26న ‘ఈగల్’ (EAGLE — Elite Action Group for Drug Law Enforcement)ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ‘ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్, ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే’ సందర్భంగా యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ‘ఈగల్’ టీమ్ లోగోను సీఎం రేవంత్ ఆవిష్కరించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (TGNAB)ని మరింత బలోపేతం చేస్తూ విస్తృత అధికారాలను అప్పజెప్పారు. ఈగల్ యాక్షన్ .. రాష్ట్రంలో గంజాయి సాగును గుర్తించి నాశనం చేయడం. డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించడం. ఈగల్ ఫోర్స్ డైరెక్టర్‌గా సందీప్ శాండిల్యా.



### గట్టి నిఘా.. స్నిఫర్ డాగ్స్..

డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ఈగల్ టీమ్ ముమ్మరంగా రెయిడ్స్ చేస్తున్నది. హైదరాబాద్ సిటీకి డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు అమ్ముతున్నారు ? ఎవరు కొనుగోలు చేస్తున్నారు? ఎక్కడి నుంచి ఎక్కడికి ఎలా సప్లై అవుతున్నది ? ఇలాంటి వాటిపై టీమ్ గట్టి నిఘా పెట్టింది. డ్రగ్స్‌ను పట్టుకునేందుకు కొత్త టెక్నాలజీని వినియోగిస్తున్నది. మరోవైపు స్నిఫర్ డాగ్స్‌కు కూడా ప్రత్యేక శిక్షణ ఇచ్చి డ్రగ్స్‌ను కూకటివేళ్లతో పీకేస్తున్నది.

- హైదరాబాద్ కు సరఫరా అయ్యే డ్రగ్స్ పై నిఘా పెట్టిన టీజీ న్యాబ్ పోలీసులు.. అదుపులోకి తీసుకుంటున్నారు. డ్రగ్స్ పెడ్లర్లు, స్మగ్లర్లనే కాకుండా కస్టమర్లపైనా కఠినమైన సెక్షన్ల కింద కేసులు పెడుతున్నారు. గోవా పెడ్లర్లపైనా ఫోకస్ చేస్తున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు సప్లై అయ్యే డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు ఆపరేషన్స్ నిర్వహిస్తున్నారు.
- రాష్ట్రంలో సింథటిక్ డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాల కట్టడికి ఈగల్ ఫోర్స్ ప్లాన్ రూపొందిస్తున్నది. ఫార్మా ఇండస్ట్రీస్‌లో అక్రమంగా తయారు చేస్తున్న సైకోట్రోపిక్ పదార్థాలను అరికడుతున్నది. రాష్ట్రంలో సింథటిక్, కొత్త తరహా డిజైనర్ డ్రగ్స్ తయారీ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నది. ఫార్మా డ్రగ్స్ నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్టుగా తయారవుతున్నాయా ? లైసెన్స్ పొందిన యూనిట్లు దుర్వినియోగానికి గురవుతున్నాయా? అనే అంశాలపై పర్యవేక్షణ చేస్తున్నది.

### టీమ్‌లో ఎవరుంటారు?

ఈగల్ టీమ్.. ఇది ఒక రాష్ట్రస్థాయి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్. ఇందులో పోలీసు శాఖలోని వివిధ విభాగాలైన ఇంటెలిజెన్స్, నార్కోటిక్స్, సైబర్, ఫీల్డ్ ఆపరేషన్స్ నుంచి ఎంపికైన నిపుణులు ఉంటారు. జిల్లాస్థాయిలోనూ టాస్క్ ఫోర్స్‌టీమ్‌లు ఉంటాయి. ఈగల్ రాష్ట్రవ్యాప్తంగా అవసరాన్ని బట్టి స్థానిక పోలీసు, కమిషనరేట్లలోని పోలీసులు, అంతర్రాష్ట్ర కో ఆర్డినేషన్ టీమ్స్‌తోనూ కలిసి ఆపరేషన్స్ నిర్వహిస్తున్నది. అత్యాధునిక టెక్నాలజీని ఈగల్ వినియోగించుకుంటున్నది. ఆపరేషనల్ సెక్యూరిటీ కారణంగా సిబ్బంది సంఖ్యను ఈగల్ వెల్లడించడంలేదు.




### ఈగల్ ఆపరేషన్స్‌లో కొన్ని..

- 2025 అక్టోబర్‌లో ఐడీఏ బొల్లారంలోని కెమికల్ కంపెనీపై దాడి. సుమారు రూ. 72 కోట్ల విలువైన 220 కిలోల ఎఫిడ్రిన్ స్వాధీనం.
- 2025 సెప్టెంబర్‌లో గచ్చిబౌలిలోని కో-లివింగ్ స్పేస్ నుంచి భారీగా ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం.
- 2026 మార్చిలో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఒక భారీ సింథటిక్ డ్రగ్ తయారీ కేంద్రంపై రెయిడ్. 10 కిలోల మెఫీడ్రిన్ డ్రగ్‌తో పాటు 1000 లీటర్లకుపైగా ముడి పదార్థాలు సీజ్.
- 2026 మార్చిలో మెదక్ జిల్లాలోని ఒక దాబాలో డ్రగ్ సప్లైపై నిఘా పెట్టి 10 కిలోల ఎండీఎంఏ, 20 కిలోల మెఫీడ్రిన్ సీజ్ చేశారు.
- ఢిల్లీ పోలీస్ క్రైమ్ బ్రాంచ్‌తో కలిసి దేశవ్యాప్తంగా నైజీరియన్ డ్రగ్ నెట్‌వర్క్ ఛేదన. 50 మందికిపైగా నిందితుల అరెస్ట్. రూ. 3.5 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం.
- 2026 మార్చి 14న మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌పై రెయిడ్. రోహిత్ రెడ్డితోపాటు ఏపీ ఎంపీ పుట్టా మహేశ్ తదితరుల అరెస్ట్.

### ప్రభుత్వ యాక్షన్

- తెలంగాణ ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో ఈగల్ టీమ్ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి 172 కొత్త వాహనాల కొనుగోలుకు రూ. 10.33 కోట్లు కేటాయించింది.
- రాష్ట్రంలో వరంగల్, హైదరాబాద్, మల్కాజిగిరి( రాచకొండ), సైబరాబాద్ కమిషరేట్ల పరిధిలో నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు. ఒక్కో దానికి రూ. 2 కోట్ల చొప్పున నిధుల కేటాయింపు.
- డ్రగ్స్ నేరాలకు సంబంధించి విదేశీయులను పంపించే (డిపోర్టేషన్) ఖర్చుల కోసం రూ. 50 లక్షలు కేటాయింపు.
- విద్యార్థుల్లో డ్రగ్స్ అలవాట్లను గుర్తించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ‘మిత్ర’ యాప్‌ను నార్కోటిక్స్ బ్యూరో, ఐటీ శాఖ సంయుక్తంగా నిర్వహణ.
- పాఠశాలలు, కళాశాలల్లో ‘ ప్రహరి క్లబ్బులు’ ‘ యాంటీ డ్రగ్ కమిటీలు’ ఏర్పాటు. విద్యార్థుల్లో డ్రగ్స్ నియంత్రణకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ. అదేవిధంగా 40 వేలకుపైగా హ్యాండ్ బుక్స్ పంపిణీకి అధికారుల చర్యలు.
- డ్రగ్స్ కేసుల్లో వేగంగా శిక్షలు పడేలా ప్రత్యేక విచారణా యంత్రాంగం ఏర్పాటు.
- యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సిబ్బందికి 60% అదనపు అలవెన్స్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం.